క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తగరపువలస: ఆనందపురం మండలంలోని శొంఠ్యాం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, మామిడిలోవ, కణమాం 11 కేవీ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ అంతరాయం కారణంగా మండలంలోని రామవరం, జీవీ అగ్రహారం, గోరింట్ల, ఎర్రవానిపాలెం, భీమందొరపాలెం, కోలవానిపాలెం, కణమాం, పప్పులవానిపాలెం గ్రామాల్లో గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని మండల విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

జీవో నంబర్ 117 రద్దు చేయాలి

తగరపువలస: జీవో నంబర్ 117 రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆనందపురం మండల శాఖ అధ్యక్షుడు గంగాధరుడు కోరారు. గురువారం ఉపాధ్యాయుల సమస్యలపై మండల కార్యవర్గ సమావేశం గుమ్మడివానిపాలెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో గంగాధరుడు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగానికి ఇబ్బంది కలిగించే జీవో నంబర్ 117ను రద్దు చేయాలని కోరారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం తగ్గిపోతుందన్నారు. మాతృభాషకు ప్రాధాన్యమిస్తూ ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంను సమాంతరంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కొటాన శ్రీను, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కరుణాకర్, ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ, మన్యం జిల్లా కార్యదర్శి జి.మురళీకృష్ణ, మండల కార్యదర్శి పి.రమేష్, గౌరవ అధ్యక్షుడు బాబూరావు, ఈశ్వరరావు, నారాయణరావు, ఉమ, తదితరులు పాల్గొన్నారు.


స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థుల అండ



స్నేహితుడు సీతారాం కుమార్తె భవ్యశ్రీ స్కూల్ ఫీజు చెల్లిస్తున్న పూర్వ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ 1992వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ స్నేహితుడు కొమ్మ సీతారాం కుమార్తె భవ్యశ్రీని 9, 10వ తరగతులు చదివించడానికి ముందుకొచ్చారు. ఇటీవల చనిపోయిన స్నేహితుడు మురళి కుటుంబానికి ఇచ్చిన మాట ప్రకారం ఆమె చదువుతున్న భీమిలి కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయిని గురువారం కలిశారు. మొత్తం ఫీజు రూ.28 వేలు కాగా ఆయనతో మాట్లాడి రూ.16 వేలు తగ్గించేలా మాట్లాడారు. దీంతో మిగిలిన రూ.12 వేల ఫీజుతోపాటు పుస్తకాల నిమిత్తం విద్యార్థిని భవ్యశ్రీకి మరో రూ.6500 అందించారు. కార్యక్రమంలో పిట్ట శ్రీనివాసరావు, దొడ్డి హేమచంద్రశేఖర్, మద్దిల సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రముఖులకు విద్యార్థుల నివాళి



అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద, పింగళి వెంకయ్య చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తగరపువలస : భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద, పింగళి వెంకయ్య చిత్రపటాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మహనీయుల గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం మహనీయుల జీవిత చరిత్రపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాంబాబు, తదితరులు



భీమిలిలోని క్యాంప్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

తగరపువలస: భారతదేశ స్వాతంత్య్రం కోసం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి 27 ఏళ్ల వయసులో అశువులు బాసిన మహావీరుడు అల్లూరి సీతారామరాజు అని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొనియాడారు. భీమిలి క్యాంప్ కార్యాలయంలో ఆయన అల్లూరి చిత్రపటానికి గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో అల్లూరి రగిల్చిన పోరాట స్ఫూర్తి ఉండాలన్నారు. అలాంటి వీరుడు మన ప్రాంతంలో జన్మించడం మనందరి అదృష్టమన్నారు. అనంతరం అల్లూరి చిత్రపటానికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, ఎంపీపీ కె.రాంబాబు, పోతిన హనుమంతరావు, శిల్లా కరుణాకరరెడ్డి, అల్లిపల్లి నరసింగరావు, మజ్జి వెంకటరావు, చిల్ల సూర్యనారాయణ రెడ్డి, యలమంచిలి సూర్యనారాయణ, జీవీ రమణ, శిరిగుడి ఆదిబాబు, ఈర్ల ఈశ్వరరావు, అంజూరి అప్పారావు, బొట్ట రామకృష్ణ, చిల్ల ప్రమీల, జీరు పద్మ, చేకూరి రజని, లెంక రమేష్ పాల్గొన్నారు.

పద్మనాభం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అల్లూరి చిత్రపటానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో బి.శైలజ, ఈవోఆర్డీ కుమార్, గంధవరం సర్పంచ్ జి.వి.కె.కె.వర్మ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు మహోజ్వల శక్తి

తగరపువలస: దేశ స్వాతంత్య్రం కోసం సాయుధ పోరాటం చేస్తూ ప్రాణాలు అర్పించిన మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు అని చిట్టివలసకు చెందిన వామపక్ష నాయకులు కొనియాడారు. గురువారం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, నూలు ఆదినారాయణ, చిల్ల రాంపైడి, మావూరి వీర్రాజు, చిల్ల అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు. చిట్టివలస సీటు కార్యాలయం వద్ద అల్లూరి చిత్రపటానికి ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, ఎస్.శ్రీనివాసవర్మ, ముగడ ఈశ్వరరావు, ఉప్పాడ ప్రవీణ్ పాల్గొన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి, విద్యార్థులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, విద్యార్థులు అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు.

పీఎం పాలెం: శిల్పారామంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి, సిబ్బంది నివాళులర్పించారు.

- జీవీఎంసీ 6వ వార్డులోని బక్కన్నపాలెం ఏపీఎస్పీఎఫ్ పోలీస్ శిక్షణా కేంద్రంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి 16వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు నివాళులర్పించారు.

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి, అధ్యాపకులు కె.పార్వతీదేవి, డాక్టర్ అప్పలనాయుడు, ఎస్.శ్రీను, డాక్టర్ బి.సహదేవుడు నివాళులర్పించారు.

కొమ్మాది: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా భవన్‌లో అల్లూరి విగ్రహానికి ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మందారాణి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు భవన్ సభ్యులు తెలిపారు.

- జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది గ్రామంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి స్థానిక నాయకులు సియ్యాద్రి కనకరాజు, గుంటుబోయిన శ్రీనివాస్‌యాదవ్, సంజీవ్ యాదవ్ నివాళులర్పించారు.

మధురవాడ: గణేష్‌నగర్ సమీప అల్లూరి సీతారామరాజు నగర్‌లోని అల్లూరి విగ్రహానికి పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, యూపీహెచ్‌సీ వైద్యాధికారి మానస లక్ష్మి నివాళులర్పించారు. పౌర సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు బెల్లాపు పాపారావు, శ్రీపాద వెంకటరమణ, బయిపిల్లి సతీష్‌కుమార్, పోలిశెట్టి నాగేశ్వరరావు, ఎస్.బాబ్జి, వెంకట బ్రహ్మాజీరావు, దువ్వి శ్రీనివాసరెడ్డి, మామిడి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

- చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద అల్లూరి విగ్రహానికి పిళ్లా శ్రీనివాసరావు, పీసరామారావు, జగ్గుపిల్లి నాని, భోగవిల్లి నాని, నాయకులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, పీవీజీ అప్పారావు, పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, నాగోతి తాతారావు, గూడేల కామేశ్వరరావు నివాళులర్పించారు. నవతరం పార్టీ నాయకుడు రాజేష్‌శర్మ ఆధ్వర్యంలో ఏఎస్ఆర్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ మానస, బీజేపీ సీనియర్ నాయకుడు బ్రహ్మాజీరావు, గౌతమి, చిరంజీవి, పద్మావతి నివాళులర్పించారు.



భీమిలిలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీ మండలి విద్యార్థులు



గుజ్జు రామునాయుడు భవన్‌లో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



శిల్పారామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద విశ్వనాథరెడ్డి, తదితరులు



గిరిజన భవన్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు



కొమ్మాదిలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఏఎస్ఆర్ నగర్‌లో నివాళులర్పిస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు



చంద్రంపాలెం బాపూజీ కళా మందిరం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుణాత్మక విద్య అందించాలి



మాట్లాడుతున్న డైట్ లెక్చరర్ త్రినాథరావు

పద్మనాభం: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని భీమునిపట్నం డైట్ లెక్చరర్ సారిపల్లి త్రినాథరావు సూచించారు. మండలంలోని ఐనాడ, బొత్సపేట ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలన్నారు. స్థానిక వనరులను వినియోగించుకొని ప్రణాళికతో విద్య బోధించాలన్నారు. బేస్‌లైన్ టెస్టు నిర్వహించాలని, విద్యార్థుల నమోదును పెంచుకోవాలన్నారు. పాఠశాలల్లో ఉన్న లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్మశానవాటికకు దారి సమస్య

మరడపాలెం వాసులకు తప్పని ఇబ్బందులు



మృతదేహాలను ఈ తుప్పల మాటు నుంచి తీసుకెళ్లాల్సిందే...



వివాదాస్పదమైన స్థలంలో ముళ్లచెట్లు



శ్మశానవాటికకు చేరుకోవాలంటే ఈ గెడ్డ నీటిలో దిగాల్సిందే...

తగరపువలస : భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీలోని మరడపాలెం, మహాలక్ష్మీపురం గ్రామాల ప్రజలకు శ్మశానవాటిక కష్టాలు ఏళ్ల తరబడి తప్పడం లేదు. తమ కుటుంబ సభ్యులు, బంధువుల మృతదేహాలను తీసుకెళ్లడానికి సరైన మార్గం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరడపాలెం నుంచి తగరపువలస – భీమిలి ప్రధాన రహదారిని దాటగానే వారికి కష్టాలు ప్రారంభమవుతున్నాయి. శ్మశానవాటికకు వెళ్లాలంటే వివాదంలో ఉన్న సర్వే నంబర్ 83లోని ప్రైవేట్ స్థలాన్ని ముందుగా దాటాల్సి వుంటుంది. ప్రస్తుతం ఆ స్థలం యాజమాన్య హక్కుల వివాదం ముగ్గురి మధ్య నలుగుతోంది. ఈ స్థలం మొత్తం తుమ్మ కంచెలతో నిండిపోయింది. ఒకవేళ ఈ స్థల వివాదం పరిష్కారమైనా ఎవరో ఒకరి చేతుల్లోకి వెళ్లిపోతుంది. భీమిలి పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ స్థలం అత్యంత విలువైనది కావడంతో ఎవ్వరూ తమ స్థలం నుంచి మృతదేహాలను తరలించడానికి ఒప్పుకోరు. అడుగు స్థలం కూడా ఇవ్వరు. ప్రస్తుతం ఈ స్థలంలో ఎవరూ లేకపోవడంతో అష్టకష్టాలు పడి అంతిమ యాత్రలు చేస్తున్నా మధ్యలో గెడ్డలు కూడా ఇబ్బంది కలిగిస్తున్నాయి. చిట్టివలస చెరువు నుంచి జీరుపేట, చిల్లపేట, గల్లీరోడ్డు మీదుగా వచ్చే గెడ్డ నీరు ఇబ్బందిగా ఉంది. ఈ గెడ్డలో పైపులు వేసి రహదారి చేసుకుందామన్నా వివాదాస్పదమైన స్థలంలోకి ఎవ్వరినీ అనుమతించడం లేదు.

గుంపులు గుంపులుగానే రాకపోకలు

మరడపాలెం శ్మశానవాటికకు గుంపులుగా తప్ప ఒకరిద్దరు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చీకటి పడిన తర్వాత శ్మశానవాటికకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లలేరు. తగరపువలస – భీమిలి రహదారిని ఆనుకుని వందల సంఖ్యలో తుమ్మ చెట్లు అల్లుకుని ఉండటంతో వాటిలో నుంచి ఒంటరిగా నడచుకుని వెళ్లడం చాలా కష్టం. ఇక మృతదేహాలను పాడెపై మోసుకెళ్లడం జరిగే పని కాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరడపాలెం, మహాలక్ష్మీపురం, మూలకుద్దు వాసులకు శ్మశానవాటికకు కేటాయించిన స్థలంలో ఎలాంటి వసతులూ లేవు. ఎండావానల నుంచి తలదాచుకోవడానికి షెల్టర్లు, నీటి వసతులు లేకపోవడంతో వచ్చిన వారు ముళ్లచెట్ల కింద తలదాచుకుని తలకొరివి సమయంలో గెడ్డలో నీటినే వినియోగిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకమైన శ్మశానవాటికకు రహదారి, బోరు బావి, షెల్టర్, మార్గమధ్యలో గెడ్డపై పైపులతో నిర్మాణం వంటి వసతులు చేపట్టాలని ఈ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఛాత్రోపాధ్యాయులకు బోధన ప్రాక్టికల్స్

భీమునిపట్నం : భీమిలిలోని ప్రభుత్వ నెహ్రూ ఉన్నత పాఠశాల వద్ద జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లోని ఫైనలియర్ ఛాత్రోపాధ్యాయులకు బోధన ప్రాక్టికల్స్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ అధ్యాపకులు త్రినాథ్ మాట్లాడుతూ కోర్సు ముగించుకుని వెళ్తున్న వీరి ద్వారా కొన్ని సబ్జెక్ట్‌లలో విద్యార్థులకు పాఠాలు బోధించామని తెలిపారు. తద్వారా వీరికి బోధన మెలకువలు తెలుస్తాయని, వీరు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టేటప్పుడు ఎంతగానో ఉపయోగపడుతుందని వెల్లడించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, చంద్రరావు, కుసుమలత పాల్గొన్నారు.



పాఠశాలలో ఉపాధ్యాయులతో ఛాత్రోపాధ్యాయులు

వంద ఆవులకు టీకాలు



రెడ్డిపల్లిలో ఆవులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శ్రీనివాసరావు

పద్మనాభం: పశువులకు సోకే లంపీ వ్యాధిపై రైతులంతా అప్రమత్తంగా ఉండాలని రెడ్డిపల్లి పశువైద్యాధికారి ఆర్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రెడ్డిపల్లిలో వంద ఆవులకు గురువారం లంపీ వ్యాధి సోకకుండా ముందస్తుగా ఆయన టీకాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ లంపీ వ్యాధి సోకిన ఆవులకు చర్మంపై బొడిపెలు, అధిక జ్వరం రావడం, మేత తినకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి నివారణకు రైతులు ఆవులకు టీకాలు వేయించాలన్నారు. జూలై నెల చివరి వరకూ టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఎన్.సుజాత, కన్నయ్య పాల్గొన్నారు

పాక్షికంగా విద్యా సంస్థల బంద్

తగరపువలస: విద్యార్థి ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు గురువారం చేపట్టిన దేశ వ్యాప్త బంద్‌కు మిశ్రమ స్పందన కనిపించింది. ఆనందపురం మండలంలో ప్రైవేట్ విద్యాసంస్థలకు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించారు. భీమిలి మండలంలో మూడు కార్పొరేట్ స్కూళ్లు మినహా మిగిలిన ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలపై బంద్ ప్రభావం కనిపించలేదు.

రేపు వ్యాక్సినేషన్

మధురవాడ: ఈ నెల 6న ప్రపంచ జునోసిస్ డేని పురస్కరించుకుని మధురవాడలోని చంద్రంపాలెం పశు వైద్య కేంద్రం ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తున్నట్లు వైద్యాధికారి ఆర్.అనుపమ సూచించారు. ఈ అవకాశాన్ని జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల పరిధిలోని పెంపుడు జంతువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మనుషులను పిచ్చి కుక్క కరిచినా, గీకినా అతి ప్రమాదకరమైన రేబిస్ సోకుతుందన్నారు. దీనిని నిర్మూలించడానికి ప్రతి కుక్కకీ టీకా వేయించాలని సూచించారు.

ఏయూకు పుస్తకాలు బహూకరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయానికి ఆస్ట్రేలియా తొలితరం రచయిత, విశ్రాంత మైనింగ్ ఇంజినీర్ వి.ఎస్.ఊటుకూరి రచించిన తెలుగు పాటలకు సంబంధించిన పరిశోధనాత్మక పుస్తకాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబుకు అందించారు. గురువారం రిజిస్ట్రార్‌ను కార్యాలయంలో శ్రీధర్ కరుణాకర్, ఆస్ట్రేలియా వర్సిటీ గణిత అధ్యాపకురాలు ప్రవాస రచయిత్రి ఉషా శ్రీ దేవి, ఏయూ తెలుగు ఆచార్యులు అయ్యగారి సీతారత్నం కలిసి ఈ పుస్తకాలను బహూకరించారు.

వైఎస్సార్ జయంతికి సేవా కార్యక్రమాలు చేపట్టండి



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాసరావు

తగరపువలస: ఈ నెల 8న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలతో నిర్వహించాలని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం భీమిలిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పాలిట పెన్నిధి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆ రోజు అన్ని గ్రామాల్లో మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని సూచించారు.

ప్రకృతి ఆధారిత ఆహారంతో మెరుగైన ఆరోగ్యం



మాట్లాడుతున్న గ్రీన్ క్లైమేట్ టీం కార్యదర్శి రత్నంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

పద్మనాభం: ప్రకృతి ఆధారిత ఆహారాన్ని భుజించడం ఆరోగ్యకరమని గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం సూచించారు. పద్మనాభంలోని కస్తూర్బా విద్యాలయానికి గురువారం గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో సభ్యులు మొక్కలు, విత్తనాలు అందజేసి నాటించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ ఏటా కలుషిత ఆహారం తినడం వల్ల పది మందిలో ఒకరు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఐదేళ్ల కంటే తక్కువ వయసు గల పిల్లలు 40 శాతం మంది అనారోగ్యకరమైన ఆహారం తినడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ మాట్లాడుతూ జూన్ ఐదు నుంచి విద్యా శాఖ, సమగ్ర శిక్ష అభియాన్ సంయుక్తంగా విద్యా సంస్థల్లో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, ప్రకృతి ఆధారిత కూరగాయలు, ఆకు కూరలు పండించే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో జి.రమణమ్మ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వలంటీర్ రవి తేజ పాల్గొన్నారు.